క్లుప్తంగా

పిఠాపురం గ్రూపు ఆలయాల ఈఓగా శ్రీరాములు



పిఠాపురం: పిఠాపురంలో దేవదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న గ్రూపు ఆలయాల ఈఓగా నున్న శ్రీరాములు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. పిఠాపురంలో ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

రాక్ సిరామిక్స్‌లో రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన కల్లోల్ కుమార్ ఘోష్

సామర్లకోట: స్థానిక పెద్దాపురం ఏడీబీ రోడ్డులోని రాక్ సిరామిక్స్‌లో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని రాక్ సిరామిక్స్ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ కల్లోల్ కుమార్ ఘోష్ ప్రారంభించారు. రోడ్డు ప్రమాదం జరిగిన సమయంలో క్షతగాత్రులకు రక్తం లభించక పోవడంతో చాలామంది చనిపోతున్నారని, అటువంటి వారి ప్రాణం నిలిపేందుకే రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్టు రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ వైడీ రామారావు అన్నారు. రాక్ సిరామిక్స్ హెడ్ హెచ్ఆర్ అండ్ అడ్మిన్ టి.నీరజ్‌కుమార్, జనరల్ మేనేజర్ రాజేంద్ర సింగ్ మాన్, శానిటరీ వేర్ హెడ్ పి.శివరాఘవరావు, మేనేజర్ బాలాజీ పీఆర్వో వీజీఎస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఫ్యాక్టరీకి చెందిన 300 మంది రక్తదానం చేసినట్లు పీఆర్వో కుమార్ తెలిపారు.

క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా సోనియా



దొరబాబును కలసి కృతజ్ఞతలు తెలియజేస్తున్న సోనియా మేరీ

సామర్లకోట: వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా మడికి సోనియా మేరీ ఎన్నికయ్యారు. పదవి రావడానికి కారణమైన నియోజకవర్గ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబుకు ఆమె శుక్రవారం కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక పార్టీ క్యాంపు కార్యాలయంలో దొరబాబును కలిసి పార్టీ విజయానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇప్పటి వరకు నియోజకవర్గ మైనార్టీ సెల్ కన్వీనర్‌గా ఉన్న సోనియా ఉత్తమ సేవలందించడంతో రాష్ట్ర స్థాయిలో పదవి లభించిందని దొరబాబు తెలిపారు. హైకోర్టు న్యాయవాదిగా, సామాజిక సేవా కార్యకర్తగా సోనియా మేరీ అనేక సేవలు చేస్తున్నారన్నారు. పెద్దాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, పాస్టర్ మడికి విజయ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ తనిఖీలు



ఒంటిమామిడి పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎస్పీ లతాకుమారి

తొండంగి: మండలంలోని ఒంటిమామిడి పోలీస్‌స్టేషన్‌ను పెద్దాపురం డీఎస్పీ లతా కుమారి శుక్రవారం తనిఖీ చేశారు. స్టేషన్‌లో పలు రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పోలీసు సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కోవిడ్ పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై జి.వెంకటేశ్వరరావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

విస్తృతంగా ఎస్ఈబీ దాడులు

ప్రత్తిపాడు: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్-ఎస్ఈబీ) పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం విస్తృతంగా దాడులు చేసినట్టు సెబ్ సీఐ పి.అశోక్ తెలిపారు. ఏలేశ్వరం మండలం సిరిపురంలో రెండు లీటర్ల సారాతో సొంటెపు దుర్గమ్మను అదుపులోకి తీసుకున్నామన్నారు. ప్రత్తిపాడు మండలం పెద్దిపాలెంలో సారా స్థావరంపై దాడి చేసి, సారా తయారీకి సిద్ధం చేసిన 100 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. సంఘటన స్థలం నుంచి మూడు లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, పెద్దిపాలెం గ్రామానికి చెందిన రీసు వీరబాబుపై పరారీ కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడుల్లో సెబ్ ఎస్సై బి.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

దేవతలు దివి నుంచి దిగి వచ్చే వేళ..!

- నేడు వైకుంఠ ఏకాదశి
- తెరుచుకోనున్న 'వైకుంఠం' ద్వారాలు
- వైష్ణవాలయాల్లో ముక్కోటి ఏకాదశి పూజలకు ఏర్పాట్లు పూర్తి



పిఠాపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం



పిఠాపురంలో వేంచేసిన కుంతీమాధవస్వామి

పిఠాపురం: ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని శనివారం వైష్ణవాలయాల్లో స్వామివారి దర్శనాలకు ఉత్తర (వైకుంఠ) ద్వారాలు తెరుచుకోనున్నాయి. ధనుర్మాసంలో వచ్చే ముక్కోటి ఏకాదశి రోజున వైష్ణవాలయాల్లో స్వామివారిని దర్శించేందుకు ముక్కోటి దేవతలు దివి నుంచి భువికి దిగివచ్చి భక్తులతో కలిసి శ్రీమన్నారాయణుడిని దర్శించుకుంటారనే నానుడి ఉండడంతో ఉత్తరద్వారాలు తెరుస్తారు. శుక్రవారం అర్ధరాత్రి 12 గంటల నుంచి ఉత్తర ద్వారాలను తెరవనున్నారు. ఏడాదిలో ఒకరోజు మాత్రమే తెరుచుకునే ఉత్తర ద్వార దర్శనానికి భక్తులు అధిక ప్రాధాన్యం ఇస్తారు.

ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు

జిల్లాలోని ప్రముఖ వైష్ణవాలయాలైన అన్నవరం సత్యనారాయణస్వామి, కాకినాడ భావన్నారాయణ స్వామి, పెద్దాపురం మండలం చిన తిరుపతి శృంగారవల్లభస్వామి, పంచమాధవ క్షేత్రాల్లో ఒకటైన పిఠాపురం కుంతీమాధవస్వామి, పిఠాపురం తిరుమల తిరుపతి దేవస్థానం పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ముక్కోటి ఏకాదశి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే స్వామి వారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. ఉత్తర ద్వారాలు తెరవనుండడంతో ఆలయాలను శుద్ధి చేసి స్వామివారి దర్శనానికి అన్ని ఏర్పాట్లు చేశారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా శనివారం స్వామి వారికి పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, గోదాదేవి అమ్మవారికి శ్రీచూర్ణం అర్చన నిర్వహిస్తారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు ఆళ్వార్ సమక్షంలో వార్షిక అధ్యానోత్సవం నిర్వహిస్తారు. తెల్లవారుజామున 4 గంటలకు వైకుంఠద్వార దర్శనం ప్రారంభించి రాత్రి 9 గంటల వరకూ కొనసాగిస్తారు. అన్ని వైష్ణవాలయాల్లోనూ ముక్కోటి ఏకాదశి సందర్భంగా శనివారం సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు, విష్ణుసహస్రనామార్చనలు, హనుమాన్ చాలీసా పారాయణ, గణపతి హోమాలు, గాయత్రి హోమాలు, కాలసర్పదోష నివారణ మంత్ర పూర్వక సుబ్రహ్మణ్య గాయిత్రీ హోమాలు నిర్వహించనున్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి

ఉత్తరద్వార దర్శనాలకు అధిక సంఖ్యలో భక్తులు రానున్న నేపథ్యంలో అధికారులు అన్ని దేవాలయాల్లోనూ ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నారు. వైకుంఠ దర్శనాలకు విశేష సంఖ్యలో భక్తులు హాజరయ్యే అవకాశాలు ఉండడంతో కరోనా నిబంధనలు పాటించాలని సూచిస్తున్నారు. భక్తులు భౌతిక దూరం పాటించి మాస్కులు ధరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అన్ని ఆలయాల్లోను ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు.

నేడు ఉత్తర ద్వార దర్శనం

కొత్తపల్లి: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని మండలంలోని ఉప్పాడ, కోనపాపపేట వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో శనివారం ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేసినట్టు ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు. ఉప్పాడలో స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. శనివారం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహిస్తామని చెప్పారు.

నేడు లక్షగాజుల అర్చన

మండలంలోని కొమరగిరిలో వేంచేసిన లక్ష్మీదేవి ఆలయంలో శనివారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా విశాఖపట్నానికి చెందిన అప్పల్ల రాజేంద్ర ప్రసాద్ దంపతులతో లక్ష గాజుల అర్చన నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యుడు ఆదిరాజు వెంకటేశ్వరావు తెలిపారు. అమ్మవారికి పూజ చేసిన గాజులను మహిళలకు పంపిణీ చేస్తామన్నారు.

సీఎం సహాయం పంపిణీ

సామర్లకోట: స్థానిక పార్టీ క్యాంప్ కార్యాలయం వద్ద నియోజకవర్గ పరిధిలో పలువురికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను దొరబాబు అందజేశారు. ప్రతి సచివాలయ పరిధిలో ఆరోగ్యశ్రీ కార్డులు అందుబాటులో లేని వారికి దరఖాస్తు చేసుకున్న వెంటనే నిధులు విడుదల చేస్తున్నట్టు తెలిపారు. ఈ మేరకు సామర్లకోటకు చెందిన దర్శిపాటి నాగేంద్రకు రూ.1.5 లక్షల చెక్కును అందజేశారు. కౌన్సిలర్ పిట్టా సత్యనారాయణ, దర్శిపాటి సత్యనారాయణలు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

పెద్దాపురం: మహిళా, శిశు సంక్షేమాని రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కంటే వీర్రాఘవరావు అన్నారు. మండలంలోని వడ్లమూరులో అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం ఆయన గర్భిణులు, బాలింతలకు పౌష్టికారాన్ని పంపిణీ చేశారు. ఆయన వెంట ఉప సర్పంచ్ చల్లా రామాంజనేయులు, సచివాలయ సిబ్బంది తదితరులున్నారు.

మరిడమ్మకు ప్రత్యేక పూజలు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన మరిడమ్మ అమ్మవారికి శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వీ రామ్మోహనరావుల ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు, చండీహోమంతో పాటు బంగారు, వెండి పుష్పాలతో పూజలు చేశారు.

మాండవ్య నారాయణుని దర్శనానికి ఏర్పాట్లు

- ఉదయం 4 గంటల నుంచి ఉత్తర ద్వార దర్శనం
- మధ్యాహ్నం గరుడ వాహనసేవ
- వచ్చేనెల 14 వరకు ధనుర్మాసోత్సవాలు



విద్యుత్ కాంతులతో శృంగార వల్లభ స్వామి గోపురం



ఉత్తర ద్వారా దర్శనానికి సిద్ధమైన తిరుపతి శృంగార వల్లభస్వామి ఆలయం



విద్యుత్ కాంతుల నడుమ సామర్లకోట మాండవ్య నారాయణస్వామి ఆలయం

సామర్లకోట: ధనుర్మాసంలో వచ్చే ఏకాదశిని ముక్కోటి ఏకాదశిగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా స్థానిక పురాతన విష్ణు ఆలయం మాండవ్య నారాయణస్వామి ఆలయంలో తెల్లవారు జామున స్వామి వారికి పంచామృతాభిషేకాలు, పూజలు జరుగుతాయని అర్చకులు చక్రవర్తుల రఘురామ్, రవికుమార్ తెలిపారు. తెల్లవారు జాము 4 గంటల నుంచి ఉత్తర ద్వార దర్శనం, మధ్యాహ్నం స్వామి వారి గరుడ వాహనంపై గ్రామోత్సవం ఉంటుందని తెలిపారు. ఈ నెల 16 నుంచి జనవరి 14 వరకు ధనుర్మాస ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ప్రతి రోజు పూజా కార్యక్రమాలు, అభిషేకాలు చేస్తున్నారు. 14న గోదా కల్యాణంతో ధనుర్మాస పూజలు ముగుస్తాయి. అదే విధంగా వేట్లపాలెం వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్తర ద్వారం దర్శనానికి ఏర్పాటు చేసినట్లు ఆలయ ధర్మకర్త పెండ్యాల నాగేశ్వరరావు తెలిపారు. పాత సామర్లకోటలోని వేణుగోపాలస్వామి ఆలయంలోను, విఘ్నేశ్వర థియేటర్ ఎదురుగా ఉన్న వేణుగోపాలస్వామి ఆలయంలోను ముక్కోటి ఏకాదశి పూజలకు ఏర్పాట్లు చేశారు.

శృంగార వల్లభుని ఆలయంలో..

పెద్దాపురం: మండలంలోని తొలి తిరుపతి శృంగార వల్లభ స్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయ చైర్మన్ కర్రి వెంకట రామ జగదీశ్వరరావు, ఈఓ పులి నారాయణమూర్తి ఆధ్వర్యంలో ముందస్తు చర్యలు చేపట్టారు. శుక్రవారం రాత్రి ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. శనివారం ఉదయ నుంచి భక్తులు ఉత్తర ద్వారం ద్వారా ప్రవేశించి పూజలు చేసుకునే అవకాశం కల్పించినట్లు చైర్మన్, ఈఓ తెలిపారు.

శాంతివర్ధనలో డీపీఓ తనిఖీ



చిన్నారితో మాట్లాడుతున్న అధికారులు

పెద్దాపురం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రొహిబిషన్ ఆఫీసర్ (డీపీఓ) శ్రీవల్లి బృందం పులిమేరు శాంతివర్ధన విభిన్న ప్రతిభావంతుల పాఠశాలలో శుక్రవారం తనిఖీలు జరిపారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. రికార్డులు పరిశీలించారు. చిన్నారులకు అందిస్తున్న సేవలపై పాఠశాల నిర్వాహకులు రాయవరపు వీర బాబు, సత్య దంపతులను ఆయన అభినందించారు. సీడబ్ల్యూసీ సభ్యులు నాగేశ్వరరావు, అనంత లక్ష్మి, సుధాకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

- ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు



ఆర్‌బీ కొత్తూరులో ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న దొరబాబు

పెద్దాపురం: విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. మండలంలోని ఆర్‌బి కొత్తూరు జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం మండల, పట్టణ స్థాయిలోని విద్యార్థులకు ఆయన ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఉప సర్పంచ్ గోలి రామారావు అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనందిస్తున్న ఘనత సీఎం జగన్‌దేనన్నారు. మారుతున్న ఆధునిక సాంకేతికతను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేస్తున్నట్టు ఆయన తెలిపారు. జడ్పీటీసీ గవరసాని సూరి బాబు, ఎంపీపీ పెంకే సత్యవతి, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, ఏఎంసీ చైర్మన్ వల్లూరి జ్యోతి మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న విద్యా అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉత్తమ ఫలితాల సాధనకు విద్యార్థులు కష్టపడి చదవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బి.అశోక్‌కుమార్, ఎంఈఓలు ప్రభాకర శర్మ, చౌదరి, పల్లా శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్య కోసమే ట్యాబ్‌లు

సామర్లకోట: పేద పిల్లలకు నాణ్యతతో కూడిన విద్య అందించాలనే లక్ష్యంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేస్తున్నారని దవులూరి దొరబాబు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్తు బాలికోన్నత పాఠశాలలోని విద్యార్థులకు శుక్రవారం ఆయన ట్యాబ్‌లు అందజేశారు. ట్యాబ్‌ల వినియోగంపై ఉపాధ్యాయులకు, విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఉంటుందని ఆయన చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లిషు విద్య ఉండాలని ముఖ్యమంత్రి భావిస్తే చంద్రబాబు నాయుడు అండ్ కో కోర్టును ఆశ్రయించారని దొరబాబు ఆవేదన వ్యక్తం చేశారు. హెచ్ఎం మీనామాధురి అధ్యక్షత వహిస్తూ ట్యాబ్ ప్రాధాన్యతను వివరించారు. ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య మాట్లాడుతూ ట్యాబ్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, ఎంఈఓ-2 పి.పుల్లయ్య, వైస్‌చైర్మన్లు ఊబా జాన్‌మోజెస్, కౌన్సిలర్లు పాలిక కుసుమ చంటి, పిట్టా సత్యనారాయణ, మత్రి శేషారావు, జట్ల మోహన్, సేపెని సురేష్, క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మడికి సోనియా, క్రిస్టియన్ మైనార్టీ మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు సల్లూరి కల్యాణ్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ దూళ్ల వెంకటరమణ, పార్టీ నాయకులు పాల్గొన్నారు. 10వ తరగతి విద్యార్థినులు ఇంగ్లిషులో ట్యాబ్‌ల ప్రయోజనంపై ప్రసంగించి ఆకట్టుకున్నారు.

రేపటి తరం కోసమే వికసిత్ భారత్



ప్రతిజ్ఞ చేస్తున్న రాజశేఖర్ తదితరులు

పెద్దాపురం: రేపటి తరం భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని భారత ప్రభుత్వం వికసిత్ భారత్-2047 రూపొందించిందని మండల విస్తరణాధికారి కె.రాజశేఖర్ అన్నారు. మండలంలోని దివిలి రామాలయం వద్ద శుక్రవారం వికసిత్ భారత్ యాత్ర నిర్వహించారు. సర్పంచ్ పెంకే శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈవోపీఆర్డీ రాజశేఖర్ మాట్లాడుతూ భారతదేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు గ్రామ స్థాయిలో ప్రజలను చైతన్య పరచే ఉద్దేశంతో ఈ యాత్ర ప్రారంభించినట్టు తెలిపారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత దేశాన్ని రూపొందించాలన్న లక్ష్యంతో ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ రూపొందించారన్నారు. బీజేపీ నాయకులు విత్తనాల వెంకటరమణ, దువ్వా శ్రీదేవి, ఉపసర్పంచ్ విజ్జపురెడ్డి రమేష్, ఎంపీటీసీ భద్రరావు, విజ్జపురెడ్డి రాములు తదితరులు పాల్గొన్నారు. అనంతరం మండలంలోని చినబ్రహ్మదేవం గ్రామంలో వికసిత్ భారత్ యాత్ర నిర్వహించారు.

'ఆడుదాం ఆంధ్రా'లో భాగస్వాములు కావాలి

- ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు



క్రీడా సామగ్రిని అందజేస్తున్న దొరబాబు

పెద్దాపురం: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. శుక్రవారం ఆయన పంచాయతీల సిబ్బందికి క్రీడా సామగ్రిని అందజేశారు. ఎంపీడీఓ బి.అశోక్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో దొరబాబు మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రీడా ప్రతిభ వెలికితీసేందుకు సచివాలయాల వారీగా క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో నియోజకవర్గానికి గుర్తింపు తీసుకువచ్చేలా సిబ్బంది కృషి చేయాలన్నారు. జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతి, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కంటే వీర్రాఘవరావు, గృహ సారథుల మండల కన్వీనర్ గోపు మురళి, సర్పంచ్‌లు కనపర్తి చీమదొర, ఒబలిశెట్టి అబ్బాయి తదితరులు పాల్గొనారు.

ప్రతిష్ఠాత్మకంగా 'ఆడుదాం-ఆంధ్రా' క్రీడా పోటీలు

కొత్తపల్లి: గ్రామస్థాయిలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎంపీడీఓ వెంకట నారాయణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలపై నిర్వహణ కమిటీతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ నెల 26 నుంచి గ్రామ సచివాలయాల పరిధిలో ఈ పోటీలు ప్రారంభమవుతాయన్నారు. ప్రతి గ్రామ సచివాలయ పరిధిలో ఎంపిక చేసిన క్రీడా స్థలంలో పోటీలను నిర్వహించాలని సూచించారు. ఈ పోటీలను విజయవంతం చేయవలసిన బాధ్యత నిర్వహణ కమిటీ సభ్యులపై ఉందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసాద్, ఎంఈఓ వేణుగోపాల్, వ్యాయామ ఉపాధ్యాయుడు జాన్ జోసెఫ్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఘనంగా రామానుజన్ జయంతి



విద్యార్థులకు బహుమతులు అందజేసిన ఎంఈఓ పుల్లయ్య తదితరులు

సామర్లకోట: భారత ఖ్యాతిని ఖండాంతరాలు వ్యాపింపజేసిన శ్రీనివాస రామానుజన్ ప్రతిభ, కృషి నేటి విద్యార్థులకు ఆదర్శనీయమని ఎంఈఓ-2 పి.పుల్లయ్య అన్నారు. స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో నిర్వహించిన జాతీయ గణిత దినోత్సవాల్లో ఆయన శుక్రవారం పాల్గొన్నారు. పాఠశాల హెచ్ఎం తోటకూర సాయిరామ కృష్ణ రామానుజన్ జీవిత విశేషాలు, నిజ జీవితంలో గణితం ప్రాముఖ్యతను వివరించారు. పాఠశాల గణిత క్లబ్ ఆధ్వర్యంలో గణిత రంగోలి, రామానుజన్ శోభాయాత్ర, గణిత క్విజ్, మ్యాథ్స్ టాలెంట్, గణిత నృత్యాలు, గణిత శాస్త్రవేత్తల వేషధారణ, గణిత ప్రతిజ్ఞ తదితర అంశాలపై పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గణిత నమూనాల ప్రదర్శన, రామానుజన్ వేషధారణలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. విజేతలకు ఎంఈఓ పుల్లయ్య, పేరెంట్స్ కమిటీ చైర్మన్ చందలాడ శ్రీనివాసరావు, హెచ్ఎం సాయిరామకృష్ణ బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు రామానుజన్

పెద్దాపురం: ప్రతి విద్యార్థికి గణిత మేధావి రామానుజన్ ఆదర్శప్రాయుడని స్థానిక శ్రీ ప్రకాష్ సినర్జీ పాఠశాల డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్, గణిత ఆచార్యుడు సంతానం అన్నారు. పాఠశాలలో శుక్రవారం రామానుజం జయంతిని నిర్వహించి పాఠశాల ఆవరణలోని ఆయన విగ్రహానికి నివాళులు అర్పించారు. పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు. అలాగే స్థానిక జవహార్ నవోదయలో ప్రిన్సిపాల్ కమలం గణిత మేధావి రామానుజన్ చిత్రపటానికి నివాళులు అర్పించారు.

కులతత్వాన్ని ప్రోత్సహించడం సరికాదు



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ మాల మహానాడు అధ్యక్షుడు గుబ్బల రాజు

పిఠాపురం: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎస్సీ వర్గీకరణను సమర్థించడం ద్వారా కుల తత్వాన్ని ప్రోత్సహించడం విచారకరమని ఏపీ మాల మహానాడు అధ్యక్షుడు గుబ్బల రాజు అన్నారు. పిఠాపురంలోని మాల మహానాడు కార్యాలయంలో శుక్రవారం ఆయన కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. తొలుత బీఆర్ అంబేడ్కర్, పీవీ రావు చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హైదరాబాద్‌లో ఎస్సీ వర్గీకరణకు మద్దతుగా మాదిగలు జరిపిన సభకు హాజరై వర్గీకరణకు ఉన్న ఆటంకాలు తొలగిస్తానని మాట ఇవ్వడం కులతత్వాన్ని ప్రోత్సహించడమే అన్నారు. రాష్ట్రంలో 11 శాతం ఉన్న మాలలు ఎస్సీ వర్గీకరణకు మద్దతు ఇచ్చిన పార్టీలను మట్టి కరిపించి భూస్థాపితం చేస్తారని హెచ్చరించారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల ఓటమే లక్ష్యంగా మాలలు పని చేస్తారని తెలిపారు. ఏపీ మాల మహానాడు నాయకులు ధారా వెంకటరావు, ఎం.కృపానందం తదితరులు పాల్గొన్నారు.

హిందూధర్మ పరిరక్షణ అందరి బాధ్యత

గోకవరం: హిందూ మతం ఒక జీవన విధానమని ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త, సీఎండీకేఎస్పీ సంస్థ అధినేత కంబాల శ్రీనివాస్‌రావు అన్నారు. మండలంలోని కృష్ణునిపాలెం పంచాయతీ ఆర్అండ్ఆర్ కాలనీలో శుక్రవారం హిందూ ధర్మ పరిరక్షణపై ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మతమార్పిడులు కారణంగా హిందూ మతం ప్రమాదంలో పడిందన్నారు. హిందువులు సంఘటితమై హిందూధర్మాన్ని పరిరక్షించాలన్నారు. హిందూమత పరిరక్షణకు అవసరమైతే ఆర్థికంగా సహకారం అందించడానికి తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానన్నారు. పలు గ్రామాలకు చెందిన ప్రతినిధులు ఆయా గ్రామాల్లో దేవాలయాల పరిస్థితిని ఆయన దృష్టికి తీసుకురాగా తగిన సహాయం అందజేస్తామని హామీ ఇచ్చారు. తొలుత దేవీచౌక్ ఆలయం నుంచి ఆర్అండ్ఆర్ కాలనీ వరకూ హిందువులు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వరసాల ప్రసాద్, తామర్ల రాంబాబు, ఇనకోటి బాపన్నదొర, వల్లూరి జగన్నాథశర్మ, ఉంగరాల ఆదివిష్ణు తదితరులు పాల్గొన్నారు.

ఆటో ఢీకొని వృద్ధుడి మృతి

కొత్తపల్లి: ఉప్పాడ - మూలపేట బీచ్ రోడ్డులో జరిగిన ప్రమాదంలో ఒక వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. అమీనాబాద్‌కు చెందిన బొందు మసేను (73) గురువారం రాత్రి బహిర్భూమికి గ్రామ శివారులోని పెట్రోలు బంకు సమీపాన నడిచి వెళ్తున్నాడు. అదే సమయంలో ఉప్పాడ నుంచి మూలపేట వెళుతున్న ఆటో ఢీకొనడంతో మసేను మృతి చెందాడు. ఈ ప్రమాదంపై ఏఎస్సై సత్యనారాయణ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య ఉంది.

సమస్యలపై గరంగరం

- అధికారుల తీరుపై మండిపడిన సభ్యులు
- వాడీవేడిగా గొల్లప్రోలు మండల సమావేశం



సమావేశంలో అధికారులను నిలదీస్తున్న వైస్ ఎంపీపీ మంగ

పిఠాపురం: అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం అందించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించి రైతులకు పరిహారం రాకుండా చేస్తున్నారని పలువురు సభ్యులు మండిపడ్డారు. గొల్లప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అరిగెల అచ్చియ్యమ్మ అధ్యక్షతన శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి సత్యనారాయణ వ్యవసాయ శాఖ ప్రగతిని వివరిస్తుండగా వైస్ ఎంపీపీ బత్తిన మంగ మాట్లాడుతూ ఈ-క్రాప్ నమోదు సక్రమంగా చేయకపోవడం వల్లనే కొంతమంది రైతులకు నష్ట పరిహారం రావడం లేదన్నారు. జెడ్పీటీసీ వులవకాయల నాగ లోవరాజు మాట్లాడుతూ గతేడాది మాదిరిగానే ఈ-క్రాప్ నమోదు చేయడం వల్ల కొందరు రైతులకు పంటలు పోయినా నష్ట పరిహారం అందే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. దీనిపై వ్యవసాయ శాఖాధికారి సత్యనారాయణ స్పందిస్తూ ఈ-క్రాప్ సక్రమంగానే నమోదు చేశామని, అందరికీ పంటల నష్టం పరిహారం వచ్చేలా చూస్తామన్నారు. దుర్గాడ ఎంపీటీసీ ఆకుల వెంకటరాజు మాట్లాడుతూ అరటి పంట పడిపోయినప్పటికీ నష్ట పరిహారం రాకపోతే ఎలా ? అని ఉద్యాన శాఖాధికారి శైలజను ప్రశ్నించారు. దీనిపై ఆమె స్పందిస్తూ 33 శాతం నష్టం జరిగితేనే పంట నష్ట నమోదు చేయాలనే నిబంధన ఉందని తెలిపారు. శాఖల వారీగా ప్రగతిని సమీక్షించారు. అనంతరం 2023-24 ఆర్థిక సంవత్సరానికి అంచనా బడ్జెట్‌లను సమావేశంలో ప్రవేశ పెట్టి ఏకగ్రీవంగా ఆమోదించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ డీఎల్ఎస్ శర్మ, తహసీల్దార్ వెంకటేశ్వరరావు, పలువురు సభ్యులు పాల్గొన్నారు.